రేపు జగన్నాథ రథయాత్ర

అల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి ఇస్కాన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ మహా శృంగదాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. హైదర్‌నగర్‌లోని మల్లికార్జున థియేటర్ సమీపంలోని విజయలక్ష్మి అమ్మవారి దేవాలయం నుంచి జేఎన్‌టీయూ, కేపీహెచ్‌బీ కాలనీ, కూకట్‌పల్లి, వై జంక్షన్ వరకు ఈ రథయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో విదేశీ భక్తులు, శ్రీ కృష్ణ భక్తులు పాల్గొని స్వామివారి భక్తి పాటలు, నృత్యాలతో ఈ రథయాత్ర కొనసాగనుందని పేర్కొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

అల్విన్‌కాలనీ: రానున్న ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భక్తులకు అంతరాయం కలుగకుండా ఉండేలా ఏర్పాట్లు చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎర్రబెల్లి సతీష్‌రావు అన్నారు. బుధవారం శంషీగూడ, అంబీర్ చెరువు వద్ద ఉన కట్ట మైసమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నీరెటి లక్ష్మణ్, జోగిపేట శ్రీనివాస్, కాసాని బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జై గణేష్ భక్తి సమితి ఇన్‌చార్జిగా కోటిరెడ్డి



మోతీనగర్: జై గణేష్ భక్తి సమితి కూకట్‌పల్లి, సనత్‌నగర్ ఇన్‌చార్జిగా మూసాపేట డివిజన్ అవంతినగర్ ఈస్ట్ కాలనీకి చెందిన లయన్ అన్నెం కోటిరెడ్డిని నియమిస్తూ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు జైన్ కుమార్ చారి బుధవారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా లయన్ అన్నెం కోటిరెడ్డి మాట్లాడుతూ.. ఆగస్టు నెలలో జరిగే వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో మట్టి గణపతిని పూజించి, నిమజ్జనం చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మట్టి గణపతిని పూజించాలని కోరారు.

ప్రజాస్వామ్యంలో ఎమర్జెన్సీ చీకటిరోజు



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

అల్విన్‌కాలనీ: భారత ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి అధ్యాయం నాటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయమని బీజేపీ వివేకానందనగర్ డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. వంశీరెడ్డి అన్నారు. బుధవారం ఎమర్జెన్సీ డే సందర్భంగా కూకట్‌పల్లి – ముంబాయి జాతీయ రహదారిలోని వివేకానంద విగ్రహం నుంచి ప్లకార్డులు, బ్యానర్లు పట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి అధికారాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో రాజు, వేణు, భాస్కర్ రెడ్డి, గోపాల్‌రావు, సుదర్శన్, నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఐఐటీ–జేఈఈ, నీట్, సీఎంఏ, సీక్లాట్ అంశాలపై శిక్షణ ఇవ్వడానికి తాత్కాలిక పద్ధతిలో ఖాళీల భర్తీకి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని గౌలిదొడ్డిలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల ప్రిన్సిపల్ అంజయ్య తెలిపారు. అర్హత, అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మ్యాథ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ వంటి సబ్జెక్టులలో అర్హత కలిగిన వారికి అవకాశం ఉంటుందన్నారు. దరఖాస్తులు చేసుకున్న తర్వాత రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూలకు తమ అర్హత పత్రాలతో ఉదయం 9 గంటలకు హాజరవ్వాలన్నారు. గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ కోసం ఈనెల 27న గౌలిదొడ్డిలోని కళాశాలలో రాతపరీక్ష, డెమో, ఇంటర్వ్యూలు ఉంటాయని మరిన్ని వివరాలకు హెల్ప్‌లైన్ నెంబర్ 040–23391598లో సంప్రదించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం



మూసాపేట: సైబర్ సిటీ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బుధవారం ఎలక్ట్రికల్ ఏఈ భీమలింగప్ప తెలిపారు. గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివేక్‌నగర్, రోడ్డు నెంబర్ 1, 3, 4, ప్రతిభ డిగ్రీ కళాశాల, న్యూ బాలాజీనగర్, వైఎస్ఆర్ విగ్రహం ప్రాంతం, హనుమాన్ ఆలయ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్, వివేక్‌నగర్ రోడ్డు నెంబర్ 1, 2, 3, 4, ప్రతిభ డిగ్రీ కళాశాల, ఒమిని ఆసుపత్రి, వైఎస్ఆర్ విగ్రహం ప్రాంతం, బాలాజీనగర్ దర్గా, శాంతి నిలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

విద్యాసంస్థల బస్సులపై నజర్ !

కూకట్‌పల్లి ప్రాంతంలో 26 బస్సులు సీజ్ | ఫిట్‌నెస్‌పై యాజమాన్యాలు దృష్టి సారించాలి | మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు



విద్యా సంస్థలకు చేరవేసే బస్సులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కూకట్‌పల్లి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనుబాబు అన్నారు. తమ పిల్లలను మంచి స్కూల్‌లో చదివించాలని తాపత్రయపడే తల్లిదండ్రులు స్కూల్ బస్సుల విషయంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. స్కూల్ బస్సుల విషయంలో మోటార్ వెహికల్ చట్టం పకడ్బందీగా ఉందని, అందులో తల్లిదండ్రుల నిఘా నియంత్రణకు కూడా హక్కులు కల్పించబడ్డాయని వివరించారు. స్కూల్ బస్సుల తనిఖీలు, తదితర విషయాలపై 'సాక్షి'తో బుధవారం పలు ప్రశ్నలకు సమాధానం చెప్పారు.

– కేపీహెచ్‌బీకాలనీ

ప్రశ్న : స్పెషల్ డ్రైవ్‌లో ఎన్ని బస్సులు సీజ్ చేశారు?

జవాబు : పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాం. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా కూకట్‌పల్లి ప్రాంతంలో నడుపుతున్న 26 బస్సులను సీజ్ చేశాం. వేసవి సెలవుల్లో స్కూల్ యాజమాన్యాలు బస్సుల ఫిట్‌నెస్ గురించి కూడా పట్టించుకోకపోవడం దురదృష్టకరం.



బస్సు తనిఖీ చేస్తున్న రవాణాశాఖ అధికారులు

ప్రశ్న: బస్సుల నిర్వహణలో యాజమాన్యాలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: యాజమాన్యాలు రవాణా శాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలి. ప్రధానంగా బస్సు సామర్థ్యం పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించి సర్టిఫికెట్ పొందటం, సమర్థులైన 60 ఏళ్లలోపు వయస్సు, ఐదేళ్లకు పైబడిన అనుభవంతో కూడిన డ్రైవింగ్ లైసెన్స్ గల డ్రైవర్లను నియమించాలి. డ్రైవర్లకు ప్రతి మూడు నెలలకు బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించి రిపోర్టులను భద్రపర్చాలి.

ప్రశ్న : స్కూల్ బస్సుల విషయంలో విద్యార్థుల తల్లిదండ్రుల బాధ్యత?

జవాబు: బస్సు డ్రైవర్ నియామకం విషయం మొదలుకొని నిర్వహణ వరకు విద్యార్థుల తల్లిదండ్రులు పర్యవేక్షించవచ్చు. ప్రతీ నెల ప్రిన్సిపాల్‌తో కలిసి బస్సును తనిఖీ చేసి దాని సమర్థతను, మెకానికల్ కండిషన్ పరీక్షించవచ్చు. బస్సులో ఫిర్యాదు బుక్ ఏర్పాటు చేసి నెల నెల వాటిని చెక్ చేసే విధంగా తల్లిదండ్రులు పర్యవేక్షించాలి.

ప్రశ్న : బస్సులో ప్రధానంగా ఏ పరికరాలు అందుబాటులో ఉండాలి?

జవాబు: ప్రతీ బస్సులో ప్రథమ చికిత్సకు వినియోగించే మెడికల్ కిట్, ఫైర్ సేఫ్టీ కిట్ వంటివి ముఖ్యమైనవి. అదే విధంగా అత్యవసర ద్వారం ఉన్నప్పటికీ అవి తెరుచుకోని పరిస్థితులు కూడా కొన్ని సందర్భాల్లో చూశాం. కాబట్టి దానిపైన పర్యవేక్షణ ఉండాలి. ఎట్టి పరిస్థితుల్లోను అటెండెంట్ బస్సును నడుపరాదు.

ప్రశ్న : డ్రైవర్లు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

జవాబు: వర్షాకాలంలో రోడ్లపై నీటితో నిండిన గుంతలు, కాలువలు వంటివి ప్రమాదకరంగా మారుతాయి. రోజు వెళ్లి వచ్చే దారుల్లో ఉన్న గుంతలు, కాలువలపై డ్రైవర్లకు అవగాహన అవసరం. బస్సులో ఓవర్‌లోడ్ లేకుండా చూసుకోవాలి. బస్సు ముందు, వెనుక అద్దాలు, వాటిపై నీటిని తుడిచే వైపర్స్ సరిగ్గా పనిచేస్తున్నాయో? లేదో? చెక్ చేసుకోవాలి. టైర్లు సరిగా ఉండేలా చూసుకోవాలి. బస్సు ముందు, వెనుక కనిపించేలా కెమెరాలను ఏర్పాటు చేసుకోవటం కూడా ముఖ్యం.

ఏళ్లుగా ఖాళీలు !

నగర శివారు పురపాలికల్లో భర్తీ చేయని పారిశుద్ధ్య కార్మికుల పోస్టులు

- ఉన్న ఉద్యోగులపైన అదనపు భారంతో పడకేస్తున్న పారిశుద్ధ్యం
- రోడ్ల పక్కనే పేరుకుపోతున్న చెత్తా, చెదారం
- ఇబ్బంది పడతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సాక్షి,సిటీబ్యూరో: పురపాలికల్లో ఏళ్లుగా భర్తీ కానీ పోస్టులతో శాశ్వత పారిశుద్ధ్య కార్మికుల కొరత తీవ్రంగా కనిపిస్తోంది. డ్రైనేజీలు శుభ్రం చేసే కామాటీలు, రహదారులు, వీధులు శుభ్రం చేసే స్వీపర్లు సరిపడా లేకపోవడంతో పట్టణాల్లో స్వచ్ఛత గాడి తప్పుతుంది. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 16 పురపాలికల్లో దాదాపు ఇదే పరిస్థితి ఉంది. ఏళ్లుగా పారిశుద్ధ్య విభాగాల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ చేయకపోవడంతో ఉన్న కార్మికులపైనే అదనపు భారం పడుతోంది.

10 వేల జనాభాకు..

పురపాలకశాఖ పరిపాలనా విభాగం నిబంధనల ప్రకారం ప్రతి 10 వేల జనాభాకు 28 మంది రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాల్సి ఉన్నప్పటికీ.. అమలు కావడం లేదు. జిల్లాలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, జవహర్‌నగర్, నిజాంపేట నగరపాలక సంస్థలు, కొంపెల్లి, దుండిగల్, మేడ్చల్, నాగారం, తూంకుంట, గుండ్లపోచంపల్లి, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 4,24,299 జనాభా ఉండగా.. ప్రస్తుతం సుమారు 10 లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

28 పంచాయతీలు విలీనం

ఘట్‌కేసర్, తూంకుంట, పోచారం, దమ్మాయిగూడ, నాగారం తదితర 7 పురపాలక సంఘాల పరిధిలోకి 28 పంచాయతీలు విలీనం కాగా.. మరో 34 గ్రామపంచాయతీలను కలుపుతూ.. అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపేట్ మున్సిపాలిటీలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ మున్సిపాలిటీల్లో కూడా పారిశుద్ధ్య కార్మికులు అవుట్ సోర్సింగ్ కింద పనిచేస్తున్నారు. పెరుగుతున్న జనాభా, కాలనీలకు అనుగుణంగా పురపాలక సంఘాల్లో పారిశుద్ధ్య కార్మికుల సంఖ్యను పెంచాల్సి ఉన్నప్పటికీ.. పట్టించుకోకపోవడంతో ప్రస్తుతం పనిచేస్తున్న వారిపైనే అధికభారం పడుతోంది.



ప్యానల్ పోస్టులకే..

పురపాలికల్లో కమిషనర్లు, ఇంజినీర్లు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, మేనేజర్లు, అకౌంటెంట్లు, ఆర్ఐలు, క్లర్కులు, బిల్ కలెక్టర్లు వంటి ప్యానల్ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్న ప్రభుత్వం పారిశుద్ధ్య కార్మికుల విషయాన్ని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందనే విమర్శలున్నాయి. గతంలో టీఎస్‌పీఎస్‌సీ ద్వారా జిల్లాలోని పురపాలికల్లో ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, రెవెన్యూ విభాగాల్లో ప్యానల్ పోస్టులు భర్తీ అయ్యాయి. అయితే పారిశుద్ధ్య కార్మికుల పోస్టులు మాత్రం ఖాళీగానే ఉంటున్నాయి.

పెరిగిన జనాభా

నగర శివారు 13 పురపాలికల్లో గణనీయంగా జనాభా పెరుగుతుండటంతో సుమారు 10 లక్షల జనాభా దాటింది. ఈ లెక్క ప్రకారం శివారు పురపాలక సంఘాల్లో 2,840 మంది పారిశుద్ధ్య కార్మికులు పనిచేయాల్సి ఉంటుంది. 13 పురపాలక సంఘాల్లో ప్రస్తుతం రెగ్యులర్ పారిశుద్ధ్య కార్మికులు లేకపోవడంతో పట్టణ ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. అవుట్ సోర్సింగ్ సేవల కింద నియమించిన కార్మికులతోనే పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు.

లోప భూయిష్టంగా చెత్తసేకరణ

నగర శివారు పురపాలికల్లో తడి, పొడి చెత్త సేకరణ లక్ష్యం నెరవేరడం లేదు. ప్రతిరోజూ చెత్తను వేరుచేసి సేకరించాల్సి ఉన్నా.. సరిపడా సిబ్బంది లేక ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. దీనికి నిర్లక్ష్యం కూడా ఉందని ఆరోపిస్తున్నారు. జిల్లాల్లో మొత్తంగా 16 పురపాలక సంఘాలు ఉండగా.. లక్షకు పైగా జనాభా కలిగిన పురపాలికల్లో ప్రతిరోజూ దాదాపు 65 టన్నులు, లక్ష లోపు జనాభా ఉన్న పురపాలికల్లో 40 టన్నుల చెత్త సేకరణ జరుగుతోంది. సంబంధిత అధికారులు మాత్రం చెత్త వాహనాలకు మైకులు పెట్టుకుని తడి, పొడి చెత్తను వేరుచేసి అందజేయాలని ప్రచారం చేస్తున్నా.. ఆచరణలో అమలు నోచుకోవడం లేదు. కొన్ని వార్డుల్లో 2–3 రోజుల కోసారి చెత్త తరలించే వాహనం రావడంతో అప్పటి వరకు ఇళ్లలోనే నిల్వ ఉంటోంది. చేసేదేమిలేక కాలనీలో రోడ్ల వెంబడి పారబోస్తున్నారు. దీంతో దుర్వాసన, దోమల బాధను భరించలేకపోతున్నామని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీబీ లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి



ప్రచారం నిర్వహిస్తున్న మెడికల్ సిబ్బంది

కూకట్‌పల్లి మెడికల్ ఆఫీసర్ డా. మమత

బాలానగర్: క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ వైద్యులను సంప్రదించాలని కూకట్‌పల్లి మెడికల్ ఆఫీసర్ డా. మమత అన్నారు. బుధవారం టి.బి. ముక్తి భారత్ అభియాన్‌కార్యక్రమంలో భాగంగా మెట్రో క్యాష్ అండ్ క్యారీ ఇండియా లిమిటెడ్‌లో పనిచేసే 153 మంది ఉద్యోగులకు ఏఐ ఎక్స్‌రే ద్వారా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రెండు వారాల కంటే ఎక్కువ కాలం దగ్గు రావటం, దగ్గుతున్నప్పుడు ఛాతినొప్పి, బరువు తగ్గడం, జ్వరం ముఖ్యంగా సాయంత్రం వేళల్లో రావడం, ఆకలి లేకపోవడం, శ్వాస ఆడక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. అనంతరం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీదేవి, సూపర్ వైజర్స్ మోహన్, రామకృష్ణ, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

దొంగల ముఠా రిమాండ్

13 ద్విచక్ర వాహనాల స్వాధీనం



మియాపూర్: బైక్‌ల దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను మియాపూర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. బుధవారం మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అడిషనల్ డీసీపీ ఎస్.ఉదయ్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ కుమార్, సీఐ క్రాంతి కుమార్, డీఐ రమేష్ నాయుడులతో కలిసి వివరాలు వెల్లడించారు. కొల్లూర్‌కు చెందిన ఎంకు శ్రీకాంత్(24), మియాపూర్ గోకుల్ ప్లాట్స్‌లో నివాసముంటున్న కుంభ వెంకటేశ్వర్లు అలియాస్ వెంకి(23), నల్లగొండ వేణు(20), ఏరువా గంగాధర్ శ్రీనివాస్ అఖిల్ రెడ్డి(23) నలుగురు స్నేహితులు. శ్రీకాంత్, వెంకటేశ్వర్లు బైక్ మెకానిక్‌గా పనిచేస్తుండగా నల్లగొండ వేణు లేబర్‌గా పని చేస్తున్నాడు. ఏరువా గంగాధర్ శ్రీనివాస్ అఖిల్ రెడ్డి బీటెక్ పూర్తిచేసి ఖాళీగా ఉంటున్నాడు. వీరంతా జల్సాలకు అలవాటు పడి పార్కింగ్ చేసిన బైక్‌లను చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. చోరీ చేసిన బైక్‌లను విడిభాగాలుగా చేసి ఆంధ్రప్రదేశ్, ఇతర ప్రాంతాల్లో అమ్మేవారు. మియాపూర్ ఆర్టీసీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి ఈ నెల 10న తన రాయల్ ఇన్‌ఫీల్డ్ బైక్ చోరీ అయినట్లు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు శ్రీకాంత్, వెంకటేశ్వర్లు, నల్లగొండ వేణు, ఏరువా గంగాధర్ శ్రీనివాల్ అఖిల్ రెడ్డిను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీలకు పాల్పడుతున్నట్లు అంగీకరించారు. వారి వద్ద నుంచి 13 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు.

యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలి



డ్రగ్స్‌పై పోస్టర్స్ ద్వారా అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్ రాజేష్ తదితరులు

మూసాపేట: మాదక ద్రవ్యాల జోలికి వెళితే సూసైడ్ చేసుకున్నట్లే అని, యువత డ్రగ్స్‌కి దూరంగా ఉండాలని కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ రాజేష్ అన్నారు. బుధవారం కూకట్‌పల్లిలోని అశోకవన్‌మాల్‌లో కూకట్‌పల్లి పోలీసులు సే నో టు డ్రగ్స్ అని సంతకాల సేకరణ నిర్వహించారు. మాదక ద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కళాశాలకు వెళ్లే విద్యార్థులపై తల్లిదండ్రులు, కళాశాల యాజమాన్యం శ్రద్ధ వహించాలని అన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సులో అడ్మిషన్ల గడువు పెంపు

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఫ్యాషనల్ టెక్నాలజీ అండ్ ఇంటీరియర్ డిజైన్ కోర్సులలో ప్రవేశ గడువు తేదీని పొడిగించినట్లు 'మనూ' స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డీన్ ప్రొఫెసర్ అబ్దుల్ వాహిద్ తెలిపారు. మెరిట్ ఆధారిత ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్ కోర్సులలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ఫామ్‌లను సమర్పించడానికి జూలై 9వ తేదీ వరకు తేదీని పొడిగించడం జరిగిందన్నారు.ఫ్యాషన్ టెక్నాలజీ, ఇంటీరియర్ డిజైన్‌లో సర్టిఫికెట్, డిప్లొమో, బీఎస్.సీ కోర్సులను సమానా కాలేజ్ ఆఫ్ డిజైన్ స్టడీస్(ఎస్‌సీడీఎస్) సహకారంతో స్కూల్ ఆఫ్ టెక్నాలజీ కింద ఈ కోర్సులను నిర్వహిస్తున్నామన్నారు.దరఖాస్తులను www.manuu. edu.in వెబ్‌సైట్ ద్వారా చేసుకోవాలన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్



డ్రైనేజీని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్

అల్విన్‌కాలనీ: కాలనీల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ, ఖాజా నగర్ కాలనీలో డ్రైనేజీ, రోడ్లు సంబంధించిన సమస్యలు ఉన్నాయని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన బుధవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ప్రధానంగా ఉన్న డ్రైనేజీ సమస్యను అతి త్వరలో పరిష్కరిస్తామని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. కాలనీలోని డ్రైనేజీ లైన్లకు సంబంధించి అవసరమైన బడ్జెట్‌ను ఎస్టిమేషన్ వేసి ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొన్ని చోట్ల పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లను కూడా నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో దొడ్ల రామకృష్ణగౌడ్, పోశెట్టి గౌడ్, కై సర్, నవాజ్‌ఖాన్, రజక్, ఇమామ్, సలీం, ఖాసీం, వర్క్ ఇన్‌స్పెక్టర్‌లు రవికుమార్, శ్రీనివాస్, సూపర్‌వైజర్ శివ, కాలనీవాసులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయంలో హోమం



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: అమావాస్యను పురస్కరించుకుని బోయిన్‌పల్లి రిటైల్ కూరగాయల మార్కెట్‌లోని కనకదుర్గమ్మ ఆలయంలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రిటైల్ కూరగాయల మార్కెట్ ఛైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రమేష్, నిమ్మకాయల నర్సింగ్, నర్సింగ్‌రావు, బాల్‌రాజు, నాగేష్, జగదీష్, మహేష్, సాయిరాం, వేణుగోపాల్‌రెడ్డి, శంకర్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఇబ్బందులకు గురి చేయొద్దు



ఆర్‌ఆర్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ ఈటల రాజేందర్



హష్మత్‌పేట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీ

- బీసీల కోటా నిర్ణయించకుండా స్థానిక ఎన్నికలు ఎలా నిర్వహిస్తారో ప్రభుత్వం చెప్పాలి
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
- ఎంపీ ఈటల రాజేందర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: డివిజన్‌లో అనేక ప్రాంతాల్లో 30 ఏళ్లుగా నివాసం ఉంటున్న ప్రజలకు హైడ్రా నోటీసులు ఇచ్చి ఇబ్బందులకు గురి చేయడం సరికాదని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని పలు కాలనీల్లో స్థానిక నాయకులతో కలిసి పర్యటించారు. వివిధ సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైడ్రా చేస్తున్న కొన్ని పనులు బాగునప్పటికీ పేదలకు హానీ చేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గ్రామీణ పేదరికం కంటే పట్టణ పేదరికం చాలా భయంకరమైందని అన్నారు. రాజరాజేశ్వరీ నగర్‌లో కమ్యూనిటీ హాల్ కోసం కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ స్థలం ఉంటే నిధులు విడుదల చేస్తామని కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. ప్రజలకు రేషన్ కార్డులు, పెన్షన్లు, డబల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం అర్‌అర్ నగర్‌లో కాలనీ వాసులతో మాట్లాడారు. డివిజన్‌లో రోడ్లు లేవని, తాగునీటి సరాఫరాపై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, డ్రైనేజీ సమస్యలు అధికంగా ఉన్నట్లు ప్రజలు తెలిపారు. ముఖ్యంగా ఆర్‌ఆర్‌నగర్ కాలనీ సెంటర్ ఆకతాయిలకు అడ్డగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

బీసీల కోటాపై ప్రభుత్వం సమాధానం చెప్పాలి

బీసీల కోటా నిర్ణయించకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రాజకీయాలకు ఆస్కారం లేకుండా వెంటనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఇప్పటికే పాలనా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందన్నారు.

బిళ్లలు దొరకడం లేదు..మద్యం దొరుకుతుంది

కడుపు నొప్పి వస్తే రాత్రి సమయంలో మెడిసిన్ దొరకడం లేదు కానీ మద్యం సీసా మాత్రం దొరుకుతుందని ఈట రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలు కూడా మద్యానికి అలవాటు పడుతుండటం బాధ కలిగిస్తుందన్నారు. పిల్లలు ఏం చేస్తున్నారో?, ఎక్కడికి వెళుతున్నారనే విషయాన్ని గమనించాలని తల్లిదండ్రులకు సూచించారు. లిక్కర్ షాపులు బంద్ చేస్తే జీతాలు ఇచ్చే పరిస్థితి ప్రస్తుత ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు. హస్మత్‌పేట ప్రభుత్వ పాఠశాలను పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ వాసులు మధుసూదన్‌రెడ్డి, రాంచందర్‌రావు, వేంకటేశ్వర్‌రావు, రమేష్‌యాదవ్, బీజేపీ నాయకులు తిరుపతి, మాధవరం కాంతారావు, రాజేశ్వర్‌రావు, శ్రీకర్‌రావు, సత్యమూర్తి, నర్సింగ్‌రావు, జగదీష్, శంకర్, వేణుగోపాల్‌రెడ్డి, రాజుగౌడ్, సంతోష్‌గౌడ్, అమర్‌సింగ్ రాథోడ్, లక్ష్మీ యాదవ్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



ఎల్ఓసీ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

శేరిలింగంపల్లి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ పేర్కొన్నారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని పాపిరెడ్డికాలనీకి చెందిన సుధారాణికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.2.50 లక్షల ఎల్ఓసీని బుధవారం బాధిత కుటుంబానికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుదన్నారు.

నేడు చందానగర్‌లో మంత్రి పర్యటన

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధి శ్రీదేవి థియేటర్ నుంచి అమీన్‌పూర్ వరకు రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శ్రీధర్ బాబు గురువారం(నేడు) శంకుస్థాపన చేస్తారని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుమారు రూ.45 కోట్లతో నూతనంగా రోడ్డు విస్తరించనున్నామన్నారు. చుట్టు పక్కల కాలనీ వాసులకు ఇబ్బందులు రాకుండా రోడ్డు పనులు చేపట్టాలన్నారు. మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తామని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తామన్నారు.